క్లుప్తంగా

ముక్కంటి సేవలో చిత్తూరు కలెక్టర్



ఆలయ ధ్వజస్తంభం వద్ద చిత్తూరు కలెక్టర్ షణ్మోహన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని ఆదివారం చిత్తూరు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో ఎంజీఎం విద్యార్థి సత్తా



వినయ్‌ను అభినందిస్తున్న గుడ్లూరు మయూర్

శ్రీకాళహస్తి: జేఈఈ అడ్వాన్స్ 2024 పరీక్షల్లో ఎంజీఎం విద్యార్థి ఎ.వినయ్ సత్తా చాటాడు. జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో వినయ్ ఆల్ ఇండియా ర్యాంకు 12,159, ఓబీసీ కేటగిరిలో 2,789 ర్యాంకు సాధించాడు. ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షల్లో కూడా వెయ్యికి 978 మార్కులు సాధించాడు. ఆదివారం ఆ విద్యార్థిని ఎంజీఎం గ్రూప్స్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వీఎస్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీల అభ్యున్నతికి కృషిచేయండి



దుప్పట్లు అందజేస్తున్న ప్రత్యూష

ఏర్పేడు: ఎస్టీల అభ్యున్నతికి కృషిచేయాలని రేణిగుంటలోని చేయూత సోషయల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షురాలు ప్రత్యూష అన్నారు. మండలంలోని గోవిందవరం ఎస్టీ కాలనీలో సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ సంస్థ ప్రారంభం నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. గిరిజన ప్రాంతాల మహిళలు తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి శ్రీనివాసులు, బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా విద్యాభ్యసన సామగ్రి



కిట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ బాబయ్య

నాగలాపురం: పాఠశాలకు వచ్చిన పుస్తకాలు, దుస్తులు, బెల్టులు, యూనిఫామ్ తదితర విద్యాభ్యసన సామగ్రి పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు ఎంఈఓ బాబయ్య తెలిపారు. ఆదివారం ఉదయం ఎమ్మార్సీకి చేరిన కిట్లను ఎంఈఓ పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభం కాగానే ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు మండలంలోని అన్ని పాఠశాలకు కిట్లను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

'హే సిరి అలా వెళ్లకే' షూటింగ్ ప్రారంభం



చిత్రీకరణలో పాల్గొన్న యూనిట్

తిరుపతి(అలిపిరి): పీలోక్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై షీలా లోకనాథన్ నిర్మిస్తున్న 'హే సిరి అలా వెళ్లకే' వెబ్ సిరీస్ చిత్రం ఆదివారం మానస సరోవర్ హోటల్ వద్ద ప్రారంభమైంది. రచయిత భరత్, దర్శకులు క్రిస్టోఫర్ మాట్లాడుతూ ఇది ఒక ప్రేమ కథా చిత్రమన్నారు. విభిన్నమైన కథాంశంతో సాగుతోందన్నారు. ఇందులో హాస్యం, భావోద్వేగాలతో కూడిన సన్నివేశాలు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతాయని తెలిపారు. ఇందులో హీరోగా సాయి, హీరోయిన్‌గా షీలా లోకనాథన్, ఇతర ముఖ్యపాత్రలో మోనికా రాజ్, కామెడీశాస్త్రి, వినుకొండ రవి, సుభాష్ చంద్రబోస్, గుర్రప్ప నాయుడు, భరణి కుమార్, బేబీ అభిజ్ఞ, శోధన నటిస్తున్నారు. రచన భరత్, జీ9 ఫిలిం ఫ్యాక్టరీ చిత్ర నిర్మాణ సంస్థ సహాయ సహకారాలతో ఈ సినిమా 32 రోజుల్లో తిరుపతి పరిసర ప్రాంతాల్లో జరుగుతుందని దర్శకులు, ఎడిటర్ క్రిస్టోఫర్ తెలిపారు.

లాభాల పంట పొద్దు తిరుగుడు





సాగులో ఉన్న పొద్దు తిరుగుడు పంట, పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డా.శ్రీనివాసులు

రేణిగుంట: కొద్దిపాటి మెలకువలను పాటిస్తే పొద్దు తిరుగుడు పంట అధిక లాభాలను తెచ్చిపెడుతుందని రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డా.శ్రీనివాసులు తెలిపారు. జిల్లాలో ఈ పంటను ప్రస్తుతం సుమారు 500 హెక్టార్ల విస్తీర్ణంలో పండిస్తున్నారు. ఈ నేపథ్యంలో పంట సాగు విధానం, సస్యరక్షణ చర్యలను ఆయన వివరించారు.

వంగడాలు

ప్రైవేటు హైబ్రీడ్‌తోపాటు ప్రభుత్వ విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయి. కేబీఎస్‌హెచ్-1, కేబీఎస్‌హెచ్-44, కేబీఎస్‌హెచ్-53 వంటి రకాల గింజలు 95 రోజుల్లో పంట దిగుబడి వస్తుంది. ఎకరాకు 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

నేలలు

నీరు నిల్వ ఉండని తటస్థ భూములు ఎర్ర, చల్కా, ఇసుక, రేగడి, ఒండ్రు నేలలు పొద్దు తిరుగుడు పంట సాగుకు అనుకూలమైనవి. ఉదజని సూచిక 6.5-8.0ల మధ్య ఉన్న నేలలు పంట సాగుకు అనువైనవిగా గుర్తించారు.

విత్తన మోతాదు-విత్తనశుద్ధి

నాలుగు సార్లు నేలను బాగా దున్నిన తర్వాత ఒక ఎకరాకు రెండు కిలోల విత్తనాలు వేయాలి. ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు నివారణకు క్వింటాల్ మందును 2 గ్రాముల చొప్పున కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి.

విత్తే దూరం

తేలిక నేలల్లో వరుసల మధ్య 45 సెం.మీల దూరం, మొక్కల మధ్య 20-25 సెం.మీల దూరం ఉండేలా విత్తుకోవాలి. 15 రోజుల తర్వాత కుదురుకు ఆరోగ్యవంతమైన మొక్కను ఉంచి మిగిలిన వాటిని తీసివేయాలి.

ఎరువుల యాజమాన్యం

పొలంలో విత్తే 2, 3 వారాల ముందు ఎరువు వేయాలి. ఎకరాకు మూడు టన్నుల చివికిన పశువుల ఎరువును వేయాలి. భూసార పరీక్షల అనంతరం సిఫార్సు చేసిన మోతాదులో రసాయన ఎరువులను వాడటం ద్వారా ఖర్చు తగ్గించవచ్చు. ఎకరానికి 26 కిలోల యూరియా విత్తనం వేసే సమయంలో, 30రోజుల తర్వాత మొగ్గతొడిగే సమయంలో 13 కిలోల యూరియాను, మిగిలిన 13 కిలోలను 50రోజుల తర్వాత పువ్వు వికసించే దశలో వేయాలి. ఎకరానికి 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 20 కిలోల పొటాషియంను ఆఖరి దుక్కిలో వేయాలి. పైరు పూత దశలో 2 గ్రాముల బోరాక్స్ ఒక లీటరు నీటికి చొప్పున ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేస్తే గింజలు ఎక్కువ తయారవుతాయి.

కలుపు నివారణ

విత్తిన 30-40 రోజుల వరకు పంటలో కలుపు లేకుండా చూసుకోవాలి. ఒకరాకు 1లీటరు పిండిమిథాలిన్ 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన వెంటనేకానీ మరుసటి రోజుగానీ పిచికారీ చేస్తే కలుపు నివారించుకోవచ్చు.

నీటియాజమాన్యం

తేలిక నేలల్లో 4-6 తడులు, మధ్యస్థ నేలలకు 3-4తడులు సరిపోతాయి. మొగ్గతొడుగు దశ, పువ్వు వికశించుదశ, గింజకట్టు లాంటి కీలక దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

సస్యరక్షణ



రసం పీల్చు పురుగుల నివారణకు మోనోక్రోటోఫాజ్ మి.లీ లేదా డైమిథోయేట్ మి.లీ., ట్రైటోఫాజ్ మి.లీ, ఎసిఫేట్ గ్రాము, ఇమిడాక్లోపిడ్ మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

- పొగాకు లద్దెపురుగు నివారణకు కిలో తవుడు, కిలో బెల్లం, ఒక లీటరు మోనోక్రోటోఫాస్, అవసరమైన నీటిలో కలిపి ఉండలుగా చేసి మొక్కల మొదళ్ల వద్ద సాయంత్ర సమయంలో వేయాలి. ఈ విధంగా యాజమాన్య పద్ధతులు పాటించి పంటను సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలో ఉన్న రాస్ కషివిజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.శ్రీనివాసులు తెలిపారు. ఇతర వివరాలకు 7981070420 నంబరును సంప్రదించి రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్చరీ పోటీల్లో 'మణి'రత్నం



క్రీడాకారుడు గణేష్ మణిరత్నం

నాయుడుపేటటౌన్ : పట్టణానికి చెందిన గణేష్ మణిరత్నం అనే విద్యార్థి ఆర్చరీ పోటీల్లో సత్తా చాటాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించి కాంస్య పతకం సాధించాడు. ఆదివారం ఈ మేరకు కోచ్ కమల్ కిషోర్ వివరాలు వెల్లడించారు. దక్షిణ కొరియాలో ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన ఆర్చరీ 2024- ఆసియా కప్‌లో భారత్ తరపున బరిలో దిగిన గణేష్ మణిరత్నం అత్యుత్తమ ఆటతీరును కనబరచినట్లు తెలిపారు. గత ఏడాది సైతం ఐర్లాండ్‌లో జరిగిన ప్రపంచ యూత్ ఆర్చరీ చాపింయన్‌షిప్‌లో సైతం రజత పతకం దక్కించుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పతకం సాధించిన గణేష్ మణిరత్నం, కోచ్ కమల్ కిషోర్‌ను ఏపీ ఆర్చరీ సంఘం కార్యదర్శి సత్యనారాయణ అభినందించారు. ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న మణిరత్నం, తల్లిదండ్రు హరిప్రసాద్, సుప్రియకు పలువురు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

ఘనంగా గంగమ్మ తిరునాళ్ల



పోతురాజు, గంగపెట్టె, కలశాల ఊరేగింపు

సత్యవేడు: మండలంలోని నరసరాజు అగ్రహారంలో మూడురోజుల పాటు గంగమ్మ తిరునాళ్లు నిర్వహించనున్నారు. 9, 10, 11 తేదీల్లో తిరునాళ్ల నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 8 గంటలకు గ్రామంలో పోతురాజు ముందు నడువగా అంకమ్మ గంగపెట్టె, చెల్లాతమ్మ కలశం, అంకమ్మ కలశాలు వీధుల్లో ఊరేగింపుగా తీసుకుని గంగమ్మ గుడి వద్దకు వెళ్లారు. పోతురాజు గంగమ్మపెట్టె, కలశాలకు ఇంటింటా భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, పసుపునీళ్లు చల్లి మొక్కులు చెల్లించుకొన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు కలశ స్థాపన నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు పుట్ట బంగారం తెల్చి హోమం, గణపతి పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు వీధుల మలుపుల వద్ద రక్షాబంధనం (కాపు కట్టుట) కట్టారు.

జయశంకర్‌కు అరుదైన గౌరవం



జీవితకాల సభ్యత్వం అందజేసిన థాయ్‌లాండ్ సభ్యులతో సీకే జయశంకర్

తిరుపతి సిటీ : ఎస్వీయూ భౌతికశాస్త్ర విభాగం విశ్రాంత ప్రొఫెసర్ సీకే జయశంకర్‌కు అరుదైన గౌరవం లభించింది. థాయిలాండ్ ఫిజిక్స్ అసోసియేషన్ ఆయనకు జీవితకాలపు సభ్యత్వం కల్పించింది. దీంతో ఆయన ఈ ఘనత సాధించిన మొట్టమొదటి భారతదేశపు భౌతిక శాస్త్రవేత్తగా చరిత్ర సృష్టించారు. థాయిలాండ్ వేదికగా ఈనెల 5వ తేదీ నుంచి 7వరకు జరిగిన సియా ఫిజిక్స్ కాంగ్రెస్-2024 కార్యక్రమంలో ఆయన పాల్గొని అధ్యక్షత వహించి కీలక ఉపన్యాసం చేశారు. కార్యక్రమం ముగింపు రోజున ఆయనకు ఫిజిక్స్ అసోసియేషన్ చెందిన కింగ్‌మోంగ్‌కుట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ విసను పెచరసా, నఖోన్ ఫాతోమ్ రాజాభట్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ జత్రాపాంగ్ కైనోఖావో జీవితకాల సభ్యత్వాన్ని ఆయనకు అందజేశారు. ఈ ఘనత సాధించిన ఆయనకు ఎస్వీయూ వీసీ, బోధన, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

అవగాహనతో అగ్నిప్రమాదాల నివారణ



ఏజీ అండ్ పీ ప్రథమ్ పరిశ్రమలో అగ్నిప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్

రేణిగుంట: మండలంలో అగ్ని ప్రమాదాలు, గ్యాస్ లీకేజీ ప్రమాదాలు సంభవించినప్పుడు నష్ట నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై అందరికీ అవగాహన ఉండాలని గాజులమండ్యం ఎస్ఐ సునీల్ పిలుపునిచ్చారు. మండలంలోని గాజులమండ్యం సమీపంలోని ఏజీ అండ్ పీ ప్రథమ్ కంపెనీ కోకో స్టేషన్‌లో ఆదివారం అగ్నిమాపక సిబ్బందితో గ్యాస్ లీకేజీ, అగ్నిప్రమాదాలపై లెవల్-3 మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లను ఇతర ప్రాంతాలకు తీసుకెళుతున్నప్పుడు గ్యాస్ లీకేజీ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఏజీ అండ్‌పీ ప్రథమ్ సంస్థ రీజనల్ హెడ్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ ఆనంద్ మాట్లాడుతూ గ్యాస్ లీకేజీ అయి ప్రమాదం సంభవిస్తే విపత్తు తీవ్రత ఎక్కువ కాకుండా ఎలా వ్యవహరించాలో వివరించారు. ప్రమాదం ఎదురైనప్పుడు వేగంగా ప్రతిస్పందించడంతోపాటు చురుకైన ఆలోచనతో తీవ్రతను నియంత్రించాలని చెప్పారు. అనంతరం ఫైర్ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రమాదం జరిగినప్పుడు ప్రతిస్పందించాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ రీజనల్ హెడ్ సందీప్ మిస్త్రి, ఆపరేషన్స్ మేనేజర్ డి.శ్రీను, సేఫ్టీ ఆఫీసర్ శబరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన భూమి ఆక్రమణను అరికట్టాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఏర్పేడు: మండలంలోని మర్రిమంద ఇందిరమ్మ కాలనీలో కమ్యూనిటీ భవన భూమి ఆక్రమణలను అరికట్టాలని సీపీఎం మండల కార్యదర్శి కరీముల్లా అన్నారు. మండలంలోని వికృతమాల రెవెన్యూలో ఉన్న మర్రిమంద ఇందిరమ్మ కాలనీ కమ్యూనిటీ భవన భూముల్లో ఆదివారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కాలనీ భవిష్యత్ ప్రణాళికలో భాగంగా గతంలో సర్వే నంబర్లు 132, 133లో 0.70 సెంట్ల భూములను కమ్యూనిటీ భవనం కోసం కేటాయించినట్లు వివరించారు. భూములను పలువురు స్థానికులు ఆక్రమణకు యత్నిస్తున్నట్లు చెప్పారు. పలుసార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి ప్రభుత్వ భూముల ఆక్రమణను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు రంగయ్య, వెంకటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ



మండల పూజలో పాల్గొన్న భక్తులు



సిద్ధి వినాయకస్వామి గ్రామోత్సవం

పిచ్చాటూరు: మండలంలోని గోవర్ధనగిరిలో ఉన్న సిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో ఆదివారం మండల పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఈ ఆలయానికి కుంభాభిషేకం జరిపి, 40 రోజులు పూర్తి కావడంతో మండల పూజ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సిద్ధి వినాయక స్వామివారి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులతో స్వామి వారికి నీరాజనాలు పలికారు. ఏర్పాట్లను గోవర్ధనగిరి చారిటబుల్ ట్రస్టు సభ్యులు పర్యవేక్షించారు.

నేత్రపర్వం.. భరతనాట్యం

చంద్రగిరి(తిరుచానూరు): వేసవి సెలవుల నేపథ్యంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిరుపతికి చెందిన పలు నాట్యసంస్థల ఆధ్వర్యంలో నాట్య గురువు సుజేందర్ బాబు నేతృత్వంలో భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఇందులో భాగంగా అన్నమయ్య కీర్తనలు, త్యాగరాజు కీర్తనలు, ఆంధ్ర జానపద నృత్యాలు, తరంగం కూచిపూడి అంశం, కృష్ణ నృత్యం తెలంగాణ వంటి పాటలకు కళాకారులు తిరుపతికి చెందిన భవ్యశ్రీ బృందం, బెంగళూరుకు చెందిన దివ్య పాలాక్షి బృందం, శృతి శంకర్ బృందం, హైదరాబాద్‌కు చెందిన నటరాజ నాట్యాలయం కూచిపూడి, బ్లూమింగ్ డేల్ నాట్యాలయం ఆధ్వర్యంలో భరతనాట్యం, తిరుపతి లలితాంబిక నృత్యాలయం ఆధ్వర్యంలో భరతనాట్యం, నాట్యరవళి డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో భరతనాట్యం, నటరాజ నృత్యాలయం ఆధ్వర్యంలో భరత నాట్యం, తీక్షణ భరత నాట్యం, హైదరాబాద్‌కు చెందిన సువర్ణ బృందం భరతనాట్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మూడు రాష్ట్రాలకు చెందిన కళాకారులు విభిన్న సంస్కృతులకు చెందిన నాట్యాలు అలరించాయి. కళాకారులు ప్రతిభకు మెచ్చిన ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారిని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ: సత్యవేడు నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగలోని పద్మావతి సేవ మందిరంలో ఆదివారం మండల నాయకులు, కార్యకర్తలు అభినందన సభ నిర్వహించి, ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఎన్నికల్లో గెలిపించిన సత్యవేడు నియోజక వర్గ ప్రజలకు ఎల్ల వేళలా అండగా ఉంటానని అన్నారు. నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, విశ్రాంత ఎస్పీ రమేషయ్య, నాయకులు సముద్రాల సుధాకర్‌నాయుడు, దశరథాచ్చారి, మధునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయం

వరదయ్యపాళెం: అన్నివర్గాలను సమన్వయం చేసుకుని, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆదివారం వరదయ్యపాళెంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో నిర్వహించిన సన్మాన సభలో ఎమ్మెల్యే ఆదిమూలాన్ని ఆ పార్టీ నేతలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి నిర్మల్ కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు పురుషోత్తమ్, జనసేన మండల అధ్యక్షుడు చిరంజీవి యాదవ్, కూటమి నేతలు కరుణాకర్ నాయుడు, జయచంద్ర నాయుడు, శివయ్య, నరసరాజు, చలపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమస్తు

- తల్లి, బిడ్డల సంరక్షణే ధ్యేయం
- ఎంసీపీ కార్డులతో ప్రయోజనం
- చిన్నారులకు టీకాల రక్షణ





గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు అరాఫత్ (ఫైల్), మాతా శిశు సంరక్షణ (ఎంసీపీ) కార్డు

చిల్లకూరు: మాతాశిశు మరణాలను తగ్గించేందుకు గత ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగానే అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో వైద్యసిబ్బంది, మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంది. మహిళలకు ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సులభతర ప్రసవాలు జరిపేందుకు సత్వర చర్యలు తీసుకుంది. తల్లి, బిడ్డల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నారులకు సకాలంలో వేయాల్సిన టీకాలతో కూడిన విలువైన సమాచారం తెలుసుకునేందుకు మాతా శిశు రక్షణ(ఎంసీపీ) కార్డులను అందిస్తుంది. పీహెచ్‌సీ పరిధిలో క్షేత్ర స్థాయి సిబ్బంది వాటిని అందజేస్తున్నారు.

సులభంగా ఉంటుంది..

గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టే వరకు తీసుకోవల్సిన జాగ్రత్తలు, సాధారణ వైద్యపరీక్షలు, రక్తపోటు, మూత్ర పరీక్షలు చేసుకోవాల్సిన సమయాలను నిరక్ష్యరాసుల వారు కూడా తెలుసుకునేలా కార్డులలో పొందుపరిచారు. అలాగే అనారోగ్యానికి గురైతే చికిత్స చేయించుకోవాల్సిన విధానం, సలుభతరంగా తెలుసుకునేందుకు కార్డులో సమాచారాన్ని ముంద్రించారు. గర్భిణులు, ఆరోగ్యభద్రతకు ఈ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని పలువురు అంటున్నారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజన, జననీ సురక్ష యోజన, ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన, ప్రభుత్వ ఆస్పత్రులలో కాన్పులు చేయించుకుంటే ఇచ్చే ఆర్థిక సాయం వంటి పథకాలను అమలు చేస్తున్నారు.

ఎంసీపీ కార్డుల్లో సమాచారం..

అప్పడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారుల వరకు సాధారణంగా వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీంతో ఆయా చిన్నారులకు ఇన్‌ఫెక్షన్ సోకి అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. దీంతో నిర్ణీత సమయానికి టీకాలు వేయించుకునేందుకు ఎంసీపీ కార్డుల్లో నిర్ణీత గడువు సమాచారాన్ని రూపొందించారు. దీంతో తమ బిడ్డల ఆరోగ్యాన్ని సంరక్షించేకునేందుకు పూర్తి సమాచారాన్ని ప్రతి తల్లి తెలుసుకోవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఎంసీపీ కార్డు వినియోగం అత్యంత సురక్షితం..

- ఆరోగ్యసిబ్బంది అందించాల్సిన సేవల వివరాలతో పాటు, వ్యాధి లక్షణాలును తెలియజేయడం
- గర్భాశయం, రొమ్ము కేన్సర్ లక్షణాలు తెలియజేయడం
- సంతాన చికిత్స ద్వారా అందించే చికిత్స విధానంపై అవగాహన కల్పించడం
- తొలి కాన్పులో సాధారణంగా సంభవించే సమస్యల వివరాలను అందించడం
- గర్భిణులు, బాలింతలు, తీసుకోవాల్సిన పౌష్టికాహారం వివరాలు, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల గురించి తెలుసుకోవడం
- ఐరన్, పోలిక్ యాసిడ్ మాత్రల ప్రాధాన్యతను తెలుసుకోవడం

ఎంసీపీ కార్డులో వివరాలు



మాతాశిశు సంరక్షణ(ఎంసీపీ) కార్డుల్లో తల్లి ఆరోగ్య సంరక్షణతో పాటు బిడ్డలకు ఐదేళ్లు వచ్చే వరకు ఇవ్వాల్సిన వ్యాక్సిన్‌ల వివరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. చిన్నారులకు నెలల వయస్సులో చేయాల్సిన బీసీజీ, ఓపీపీ, హెపటైటిస్, మీజిల్స్, విటమిన్-ఏ వ్యాక్సిన్‌లు, కార్డులో సూచించిన విధంగా వేయించాల్సి ఉంటుంది. బిడ్డ ఎత్తు, బరువు, కార్డులో నమోదు చేసి ఉండడంతో ఏవైనా లోపాలు ఉంటే వైద్యులకు తెలియజేసి సరైన వైద్యం పొందవచ్చు.

– అరాఫత్, వైద్యాధికారి, చిల్లకూరు



చిన్నారులకు డ్రాప్స్ వేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)



గర్భిణులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)